● తనిఖీ లేని చెక్‌పోస్టులు

ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని వసుంధర, రంపకాన, పాతపట్నం, మాతల, బలద, పట్టుపురం ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కానీ, గత ఐదేళ్లలో సెబీ, పోలీసులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. వారికి మామూళ్లు ముట్టజెప్పి.. గంజాయి రవాణా సాగించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం వసుంధర చెక్‌పోస్టు మాత్రమే కొనసాగుతోంది. అక్కడ సైతం కొన్ని వాహనాలను మాత్రమే తనిఖీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికంగా గండాహత్ రోడ్డు వయా గొప్పిలి రోడ్డు మార్గంలో పలాసకు తరలిస్తున్నట్టు తెలుస్తోంది. గొప్పిలి వద్ద కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ప్రత్యేక కోడ్ భాషల్లో తరలిస్తున్నట్టు సమాచారం.

గంజాయి వనంలా సిక్కోలు!



మాట్లాడుతున్న ఏఎస్పీ శ్రీనివాసరావు.. గంజాయితో పట్టుబడిన నిందితులు(వెనుక)



వసుంధర చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

- గత ఐదేళ్లలో కోరలు చాచిన మాఫియా
- ఒడిశా నుంచి జిల్లాకు భారీగా దిగుమతి
- పెద్ద మొత్తంలో పట్టుబడుతున్న నిల్వలు
- మత్తుకు బానిస అవుతున్న యువత

ఎన్నో ఘటనలు..

● ఈ ఏడాది మార్చి 24న ఒడిశాలోని గారబంద నుంచి గంజాయి లోడుతో వస్తున్న ఆ కంటైనర్‌ను పలాసలోని నెమలి నారాయణపురం హైవేపై అడ్డుకునే ప్రయత్నం చేయగా దూసుకుపోయింది. ఎస్‌ఐ, కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. చివరకు కంటైనర్ విశాఖలో పట్టుబడింది. అందులో 380 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

● ఈ ఏడాది మార్చి 18న పలాస రైల్వేస్టేషన్‌లో ఒడిశాకు చెందిన కరుణకరడ అనే వ్యక్తి నుంచి పోలీసులు 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కరుణకరడ.. స్వగ్రామం నుంచి గంజాయిని మూట కట్టి.. చెన్నై తీసుకెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు.

● ఈ నెల 7న శ్రీకాకుళంలో పొన్నాడ బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేయగా.. గంజాయి తరలిస్తూ నలుగురు పట్టుబడ్డారు. వారిని సీఐ విచారణ చేపట్టగా.. ఈక్రమంలో సుమారు 25మంది గంజాయి క్రయవిక్రయాలు, రవాణా సాగిస్తున్నట్టు తెలిసింది. దీంతో డీఎస్పీ, సీఐతో పాటు ఎక్సైజ్ శాఖ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి.. వాంబేకాలనీ సమీపంలో ఉన్న డచ్ బిల్డింగ్‌లో మరో ఐదుగురిని పట్టుకున్నారు. వారి వద్ద 17 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

● ఈనెల 10న ఇచ్ఛాపురంలోని పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద ఓ షాపులో విక్రయిస్తున్న 25కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● ఈ నెల 14న ఒడిశా నుంచి ఇచ్ఛాపురం మీదుగా కర్ణాటక రాష్ట్రానికి రైలు మార్గంలో సుమారు 11 కిలోలు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఇచ్ఛాపురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

● ఈ నెల 14న ఆమదాలవలసలోని బీఆర్ నగర్ సమీపంలో ఐదుగురు యువకుల నుంచి రెండున్నర కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తెప్పించి వారు విక్రయిస్తున్నట్టు గుర్తించారు.

(మెళియాపుట్టి)

జిల్లాలో గంజాయి నిల్వలు పెద్ద ఎత్తున్న పట్టుబడుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. ఒడిశా నుంచి గంజాయి దిగుమతి చేసి.. జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. జిల్లాలో నూ పలుచోట్ల విక్రయాలు సాగిస్తున్నారు. గంజాయి బారిన పడి యువకులు వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. జిల్లాకేంద్రంలో సైతం గంజాయి బ్యాచ్‌లు నేర ప్రవృత్తికి దిగుతున్న ఘటనలు ఇటీవల వెలుగుచూస్తున్నాయి. జిల్లాకు ఒడిశాతో అనుబంధం ఎక్కువ. రోడ్డు, రైలు మార్గాల ద్వారా మాదకద్రవ్యాల రవాణా సాగుతోంది. ఒడిశాలోని గజపతి, గంజాం, రాయగడ జిల్లాలకు సంబంధించి అంతర్ రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఇప్పుడు ఈ రోడ్లలో కనీస తనిఖీలు లేవు. ఉన్న చెక్‌పోస్టులను సైతం ఎత్తేశారు. ప్రత్యేక పోలీసులను విధుల నుంచి తొలగించారు. దీంతో గంజాయి రవాణాదారులు, ముఠాలు ఇష్టారాజ్యంగా జిల్లాలోకి ప్రవేశిస్తున్నారు. స్థానిక యువతతో ఒప్పందం చేసుకుని వారితోనే గంజాయిని విక్రయిస్తున్నారు. యువకులు, విద్యార్థులే గంజాయి ముఠా టార్గెట్. ఇందుకు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు నడుపుతున్నారు. గంజాయి తాగడాన్ని ఒక ఫ్యాషన్‌గా చెప్పి 20 ఏళ్లలోపు యువత, విద్యార్థులను ఆకర్షిస్తున్నారు.

● విద్యార్థులతో రవాణా..

గంజాయితో పాటు బ్రౌన్ షుగర్ వంటి ప్రాణాంతక నిషేధిత వస్తువులు చలామణి అవుతున్నాయి. వీటి రవాణాకు యువత, విద్యార్థులను వినియోగిస్తుండడం విచారకరం. ప్రస్తుతం ఈ ప్రాంతంలో అద్దెకు కార్లను ఇచ్చే సంస్కృతి నడుస్తోంది. ఎవరికైనా అవసరమైతే డ్రైవింగ్ వస్తే రోజువారి కిరాయి రూపంలో కార్లను అద్దెకు ఇస్తుంటారు. గంజాయి రవాణాదారులకు ఇదో మార్గంగా మారింది.

● పెరిగిన మద్యం రేట్లతో..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ధరలు భారీగా పెరిగాయి. క్వార్టర్ సీసా కొనుగోలు చేయాలంటే రూ.200 పైమాటే. అదే ధరకు గంజాయి పొట్లం వస్తోంది. నలుగురు, ఐదుగురు వరకూ నిషా పొందవచ్చు. దీంతో ఎక్కువ మంది గంజాయిని తీసుకుంటున్నారు. గంజాయి మత్తుకు యువత సైతం బానిసవుతున్నారు. ముఖ్యంగా జాతీయరహదారి చెంతనే ఉన్న చాలా షాపుల వద్ద గంజాయి విక్రయాలు సాగుతున్నట్టు తెలుస్తోంది. నిషేధిత గుట్కా, ఖైనీల మాటున గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం. గతంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు టోల్‌ఫ్రీ నెంబర్‌తోపాటు విద్యాసంస్థల వద్ద బోర్డులు ఏర్పాటు తప్ప.. గంజాయి రవాణాదారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి.

నలుగురైదుగురు యువకులను మాట్లాడుకుంటున్నారు. అధిక మొత్తంలో నగదు ఆఫర్ చేస్తున్నారు. అరకు, పాడేరు వంటి ప్రాంతాలకు పర్యాటకుల మాటున పంపిస్తున్నారు. గంజాయిని అధిక మొత్తంలో తెప్పించి స్థానికంగా విక్రయిస్తున్నారు. గంజాయికి విద్యార్థులు అలవాటు పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లా కేంద్రంతోపాటు ఎచ్చెర్ల ప్రాంతంలో విద్యాసంస్థలున్నాయి. అటు ఉత్తరాది రాష్ట్రాలతో అనుబంధం ఉన్న పరిశ్రమలున్నాయి. దీంతో వీరందరికీ గంజాయి అలవాటు చేసే పనిలో మాఫియా నడుస్తోంది. గంజాయి మత్తులో పడి చాలామంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఆ మత్తులో సంఘ విద్రోహ శక్తులుగా మారుతున్నారు. చోరీలకు పాల్పడడమే కాకుండా తోటివారిపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ముంబైకి తరలిస్తూ...

- ఇచ్ఛాపురంలో 32 కేజీల గంజాయి సీజ్
- ముగ్గురు అరెస్ట్

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 15: ఒడిశా రాష్ట్రం నుంచి ముంబైకి గంజాయి తరలిస్తూ.. ఇచ్ఛాపురంలో ముగ్గురు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి 32.470 కేజీల గంజాయి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం ఇచ్ఛాపురంలోని సర్కిల్ కార్యాలయంలో జిల్లా క్రైమ్ ఏఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. 'ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా మోహనబ్లాక్ ఖరీగూడా గ్రామానికి చెందిన రేష్మానాయక్, సుమతి నాయక్, రాయిజుక గ్రామానికి చెందిన గజేంద్ర నాయక్.. అదే గ్రామంలోని మఘల్ నాయక్ వద్ద గంజాయిని కొనుగోలు చేశారు. దానిని రెండు బ్యాగులు, ఒక షూట్‌కేస్‌లో సర్ది.. ముంబైకి తరలించేందుకు ఆదివారం ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు తనిఖీ చేయగా.. 32.470 కేజీల గంజాయి నిల్వలు పట్టుబడ్డాయి. గంజాయిని సీజ్ చేసి.. ఆ ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామ'ని ఏఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. 'గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపడుతున్నాం. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని రైల్వేస్టేషన్లలో పోలీసు గస్తీ పెట్టాం. యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామ'ని ఏఎస్పీ తెలిపారు. ఇదిలా ఉండగా 'ఒడిశా రైల్వేస్టేషన్లలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఇచ్ఛాపురంలో రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది లేరు. దీంతో ఒడిశాలో కొనుగోలు చేసి గంజాయిని అక్కడ నుంచి కాకుండా.. ఇచ్ఛాపురం స్టేషన్ నుంచి తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కొన్నిసార్లు పట్టుబడుతున్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, ఇచ్ఛాపురం, కవిటి ఎస్‌ఐలు చిన్నంనాయుడు, రాము, సిబ్బంది పాల్గొన్నారు.



పలాస ఆర్పీఎఫ్ కార్యాలయంలో పట్టుబడిన గంజాయి నిల్వలు (ఫైల్)

రవాణా మార్గాలు గుర్తించాం

అక్రమంగా ఒడిశా నుంచి ఆంధ్రాకు గంజాయి వచ్చే మార్గాలు గుర్తించాం. ప్రత్యేకంగా వంద రోజుల ప్లాన్ తయారుచూసి.. విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. పోలీసుల ఆధ్వర్యంలో నారోకోటికట్ టీమ్‌లు ఏర్పాటు చేసి నిఘా పెంచుతాం. సరిహద్దు రహదారుల్లో తనిఖీలు చేస్తున్నాం.

- రాజశేఖర్‌నాయుడు, ఎక్సైజ్ సీఐ, టెక్కలి

ప్రత్యేక దృష్టి సారించాం

జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, వినియోగం పెరుగుతోంది. యువకులు బంగారు భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. అందుకే గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాం. మత్తు పదార్థాల వినియోగంతో అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలపై దృష్టి పెట్టాలి'

- కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

రైలు మార్గాల్లో.. రవాణా

(పలాస)

గంజాయికి కేరాఫ్‌గా నిలిచిన ఒడిశా నుంచి పలాస మీదుగా జిల్లాకు రవాణా సాగుతోంది. ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి, మహేంద్రగిరి ఒడిశా ప్రాంతంలో గంజాయి ఎక్కువగా పండిస్తున్నారు. ఎకరాకు రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దీన్నే ప్రధాన ఆదాయ వనరుగా ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నారు. రైలు మార్గాల ద్వారా అధికంగా గంజాయి రవాణా సాగిస్తున్నారు. ఒడిశా రాష్ట్రంలోని గంజాం, ఛత్రపూర్, బర్హంపూర్ వంటి రైల్వేస్టేషన్లలో గంజాయిని ఎక్కించి.. వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. రైలులో ఎక్కువగా కొత్త సూట్‌కేసుల్లోనే రవాణా చేస్తుండడంతో ఎవరికీ అనుమానాలు కూడా కలగడం లేదు. జీడిపప్పు ముసుగులో కూడా గంజాయి, ఎర్రచందనం రవాణా అవుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఆరు నెలల కాలంలో పలాస, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ల వద్ద గంజాయితో పట్టుబడిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి.

● 2009లో ఏకంగా రైల్వే ప్రొటక్షన్‌ఫోర్స్ (ఆర్పీఎఫ్) అధికారి ఒకరు గంజాయి రవాణా చేస్తు రైల్వే పోలీసులకు పట్టుబడడం.. అప్పట్లో సంచలనమైంది. ఆర్పీఎఫ్ అధికారి తన కార్యాలయం కేంద్రం ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఇక్కడే ప్యాకింగ్ చేస్తు రైలులో ప్రయాణించే హాకర్లు, బెగ్గర్‌ల ద్వారా ముంబాయి, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు రవాణా చేస్తుండేవాడు. ఈ విషయం పసిగట్టిన రైల్వే పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో అసలు విషయం బయటపడింది.

● పలాస మీదుగానే.. తరలింపు


● అంతకు ముందు పలాస జాతీయరహదారిపై కాశీబుగ్గ పోలీసులు సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఆయల్ ట్యాంకరులో గంజాయి తరలిస్తున్న విషయాన్ని గుర్తించి అరెస్ట్ చేశారు. సుమారు 800 కిలోల గంజాయి పలాసలోనే పట్టుబడింది.

● కొన్నాళ్ల కిందట పలాస ఆర్పీఎఫ్ సిబ్బంది ఇద్దరు ఇచ్ఛాపురం వద్ద గంజాయి రవాణాదారులకు సహకరించి పట్టుబడడంతో వారిపై కేసులు నమోదయ్యాయి. కొద్ది రోజుల క్రితం పలాస రైల్వే స్టేషన్‌రోడ్డులో ఇద్దరు అనుమానితులను పట్టుకోగా గంజాయి నిల్వలు లభించాయి. మరో కేసులో గంజాయిని విడిచి ఇద్దరు వ్యక్తులు పరారీ కాగా కాశీబుగ్గ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.

● పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో గంజాయి బ్యాచ్‌లు ఇటీవల అధికమయ్యాయి. రైల్వేకాలనీ, నర్సిపురం, అక్కుపల్లి రోడ్, పారిశ్రామికవాడప్రాంతాల్లో గంజాయి సేవిస్తూ.. అటుగా వెళ్తున్న వారిపై తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఒడిశా నుంచి నిత్యం ఓ ముఠా వీరికి గంజాయి సరఫరా చేస్తుందనే ప్రచారం ఉంది. ఒడిశా సరిహద్దు మార్గాల్లో రాత్రులు కూడా నిఘా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఒడిశా నుంచి వచ్చే రైళ్లతో పాటు ఇచ్ఛాపురం, మందస, పలాస, మెళియాపుట్టి, పాతపట్నం ప్రాంతాల్లో ఉన్న సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే గంజాయి రవాణాకు అడ్డుకట్ట పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మెళియాపుట్టిలో పట్టుబడిన గంజాయి (ఫైల్)



నేడు 'మీకోసం' రద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్/ క్రైం, సెప్టెంబరు 15: శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.. 'మీ కోసం' కార్యక్రమాన్ని 16న రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మిలాద్ ఉన్ నబీ.. ప్రభుత్వ సెలవు దినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే 'మీ కోసం' కార్యక్రమాన్ని కూడా ఈసారి రద్దు చేస్తున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

'ఎల్‌హెచ్‌ఎంఎస్'ను వినియోగించుకోవాలి

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 15: జిల్లా వాసులు ఎవరైనా.. ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లేటప్పుడు.. మీ ఇంటి భద్రత కోసం పోలీసు శాఖ వద్దనున్న లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) అనే టెక్నాలజీని వినియోగించుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సేవ పూర్తిగా ఉచితమని స్పష్టం చేశారు. 'ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీసు యాప్‌లో వివరాలు రిజిస్టర్ చేసుకుంటే సేవలు వినియోగించుకోవచ్చు. ప్రయాణం తేదీ, సమయం, తిరిగి వచ్చే తేదీ వివరాలు నమోదు చేసి రిక్వెస్ట్ పంపిస్తే.. మీ ఇంటికి పోలీసులు వచ్చి మోషన్ సెన్సార్ కెమెరాను నిక్షిప్తం చేస్తారు. అప్పటి నుంచి ఇంటిని జిల్లా కేంద్రంగా ఉన్న పోలీసు కమాండ్ కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షిస్తామ'ని ఎస్పీ తెలిపారు.

పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 15: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని పర్యాటక రంగాల నుంచి అవార్డులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'మొత్తం 38 విభాగాల నుంచి 41 అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి. ఏపీ టూరిజం వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ అనే చిరునామాకు ఈ నెల 22వ తేదీలోగా అందజేయాలి. దరఖాస్తు చేయాల్సిన విభాగాల్లో ఉత్తమ హోటల్(5స్టార్, 4స్టార్, 3స్టార్), బడ్జెట్ హోటల్, బెస్ట్ వేసైడ్ ఎమినిటీస్, హరిత హోటల్, పర్యావరణ అనుకూల హోటల్, థీమ్ ఆధారిత రిసార్ట్, రెస్టారెంట్, చెఫ్, స్టాండ్- ఒంటరి కన్వెన్షన్ సెంటర్, బెస్ట్ యూనిక్ టూరిజం ప్రాజెక్టు ఉన్నాయి. అలాగే టూరిస్ట్ డెస్టినేషన్ ఉత్తమ పౌర నిర్వహణ(పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు), ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉత్తమ జిల్లా(కలెక్టర్), అత్యుత్తమ బీచ్, టూరిస్ట్ ఫ్రెండ్లీ రైల్వేస్టేషన్, సినిమా షూటింగ్ స్పాట్, పర్యాటక అనుకూల విమానాశ్రయం, బెస్ట్ టూరిస్ట్‌ఫ్రెండ్లీ బస్టాండ్ తదితర వాటితో దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలి' అని కలెక్టర్ సూచించారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

- పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో 47 యూనిట్ల రక్తం సేకరణ

శ్రీకాకుళం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జడ్పీ సమావేశ మందిరంలో.. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 47 యూనిట్ల రక్తాన్ని సేకరించి.. బ్లడ్‌బ్యాంక్‌కు అందజేశారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలను వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అలాగే బెహరా మనోవికాస కేంద్రంలో దివ్యాంగులకు రూ.5,116 నగదుతోపాటు పండ్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో పీఆర్ ఐక్య కార్యాచరణ సమితి నాయకులు ఎస్.రామకృష్ణ, కేసీహెచ్ మహంతి, ఎస్‌.శ్రీరాములు, ఎస్‌వీపీ పోలినాయుడు, కేఎస్ భరత్, పూర్వపు ఎస్‌ఈ ఏ ప్రభాకర రావు, జీఎస్ఆర్ గుప్తా, ఈఈ ఏఎస్ ప్రకాష్, డీఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పంచాయతీరాజ్ ఇంజనీర్లకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

రంగనాథ స్వామి ఆలయంలో చోరీ

ఎచ్చెర్ల, సెప్టెంబరు 15: ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట లోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఊరికి చివరలో ఉన్న ఈ ఆలయాన్ని ఇటీవల గ్రామస్థులు, దాతల సహకారంతో పునర్నిర్మించారు. కాగా.. శనివారం అర్ధరాత్రి వేళ ఈ ఆలయంలోకి దొంగలు ప్రవేశించారు. స్వామికి అలంకరించిన 7 తులాల బంగారం, 3 కిలోల వెండి ఆభరణాలు, హుండీలో రూ.లక్ష నగదు అపహరించారు. ఆలయ ప్రాంగణంలో ఒక హుండీని, సమీప పొలాల్లో మరొక హుండీని పగులగొట్టారు. ఈ విషయాన్ని ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్, క్లూస్‌టీమ్ సందర్శించి వివరాలను సేకరించారు. ఇటీవల దేవాలయాల్లో దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. గత వారం ఈ మండలంలోని కుంచాలకురమయ్యపేట దుర్గగుడిలో చోరీ జరిగింది. ఐదారు నెలల కిందట దేవీ ఆశ్రమంలో భారీ ఎత్తున చోరీ అయింది. వరుస దొంగతనాలతో పోలీసులకు సవాల్‌గా మారింది. రాత్రివేళ గర్భగుడి తలుపులు మూసే సమయంలో స్వామి, అమ్మవారి ఆభరణాలను నిర్వాహకులు తీసేసి.. తిరిగి ఉదయం వేళ వాటిని అలంకరిస్తే మేలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పగులగొట్టిన హుండీ



ఆలయంలో పరిశీలిస్తున్న క్లూస్ టీమ్



ఆమదాలవలస రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూన రవి

ఆమదాలవలస రోడ్డు..
వైసీపీ నిర్లక్ష్యానికి నిదర్శనం

- కాంట్రాక్టర్‌కు తొలిదశ బిల్లు రూ.14కోట్లు నేటికీ చెల్లించలేదు
- నెలాఖరుకు ప్రత్యామ్నాయ రహదారి నిర్మిస్తాం
- ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం రూరల్, సెప్టెంబరు 15: గత ఐదేళ్ల వైసీపీ నిర్లక్ష్య పాలనకు నిలువెత్తు నిదర్శనం.. శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు అని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన ఈ రోడ్డును పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 'రోడ్డు పనులకు సంబంధించి టీడీపీ హయాంలో 2018లో రూ.37కోట్లు నిధులు మంజూరు చేశాం. తర్వాత ఎన్నికలు రాగా.. వైసీపీ అధికారంలోకి వచ్చింది. రోడ్డు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు తొలిదశగా రూ.14కోట్ల మేర బిల్లులు నేటికీ చెల్లించలేదు. అయినా కాంట్రాక్టర్‌తో మాట్లాడి.. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇవ్వడంతో ప్రస్తుతం పనులు చేపట్టారు. కాగా.. ఇటీవల భారీ వర్షాల కారణంగా గుంతల్లో పూడ్చిన మట్టి కొట్టుకుపోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. విజయనగరం, సాలూరు వెళ్లే మార్గంలో బ్రిడ్జిలు పడిపోవడంతో సుమారు 60 టన్నుల లోడుతో భారీ వాహనాలు ఇదే రోడ్డు మీదుగా ప్రయాణిస్తున్నాయి. దీంతో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఇరువైపులా తారురోడ్డు నిర్మాణం చేపడతాం. వర్షాకాలం అనంతరం కల్వర్టులను పునర్నిర్మించి, ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వరకు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపడతా'మని రవికుమార్ తెలిపారు. అనంతరం ఏఈ, డీఈలతో ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరగాలని ఆదేశించారు.

● విపత్తులోనూ విమర్శలా?

'రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో రూ.12లక్షల కోట్లు జగన్‌రెడ్డి అప్పులు చేశారు. రూ.1.30లక్షల కోట్లు కాంట్రాక్టర్లకు పెండింగ్ బకాయిలు చెల్లించలేద'ని ఎమ్మెల్యే కూన రవి విమర్శించారు. విజయవాడ వరద ఉధృతిని జాతీయ విపత్తుగా పరిగణించి.. అందరూ సీఎం సహాయనిధికి విరాళాలు ఇస్తుంటే.. జగన్ రెడ్డి నీచ రాజకీయాలు చేస్తుండడం దారుణమన్నారు. విపత్తులో ఆదుకోకుండా విమర్శలు చేయడం తగదని తెలిపారు.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

లెటర్ రిపీటెడ్ సిరీస్

రీజనింగ్



వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు:

1. abc/bca/cab/abc.
మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
2. aaa/bbb/ccc/aaa
ప్రతి సమూహంలో ఒక అక్షరమే మూడుసార్లు ఉన్నది.
3. acac/abab/acac/abab
acac/abab అనే అక్షరాల సమూహాలు రెండుసార్లు రిపీట్ అయ్యాయి.
4. ab/aab/aaab/aaaab
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతోపాటు ఒక 'a' అదనంగా చేరుతున్నది.
5. abca/abcb/abcc/abca
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా abcలే రిపీట్ అయ్యాయి. మొదటి సమూహంలో చివరి అక్షరంగా a, రెండో సమూహంలో చివరి అక్షరంగా b, మూడో సమూహంలో చివరి అక్షరంగా c ఉన్నది. ఈ విధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
6. abcd/bcda/cdab/dabc/adcb.
మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటో అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
7. PQQ/QRR/RPP/PQQ
ప్రతి సమూహంలో చివరి రెండు అక్షరాలు ఒకటే.
8. aab/bbc/cca/aab
ప్రతి సమూహంలో మొదటి రెండు అక్షరాలు ఒకటే.
9. ab/abb/abbb/abbbb
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'b' అదనంగా చేరుతున్నది.

ప్రతి సమూహంలో ఒకే విధమైన అక్షరాలు రిపీట్ అవుతున్నాయి. ఇలాంటి సందర్భాలలో ప్రశ్నలకు సమాధానం రాబట్టడానికి కింద తెలిపిన విధానాన్ని అనుసరించవచ్చు.

ఉదా: P - R - Q - P Q - - Q R

ఎ) QPRPR బి) QPRRP

సి) QRPQP డి) ఏదీకాదు

పై ఉదాహరణలో అక్షరాలు, ఖాళీలు మొత్తం 12 ఉన్నాయి. 12 ఉంటే 3 లేదా 4 స్థానాలను ఒక సమూహంగా విభజించాలని తెలియపరచడం జరిగింది గమనించండి.

ముందుగా తక్కువ స్థానాలుగా అంటే 3 స్థానాలుగా విభజించాలి. సరిచూసిన తదుపరి కచ్చితమైన సమాధానం రావడానికి అవకాశం లేనప్పుడు ఎక్కువ స్థానాలుగా అంటే 4 స్థానాలుగా విభజించుకోవాలి.

మొదట మూడేసి అక్షరాలను ఒక్కొక్క సమూహంగా విభజిస్తే P - R / - Q - / PQ - / - QR.

విభజించిన తరవాత గమనించిన మొదటి, మూడో సమూహంలో మొదటి అక్షరం P ఉన్నది. అందువల్ల రెండు, నాలుగు సమూహంలో మొదటి అక్షరం 'P' అవుతుంది. ఇప్పుడు రెండు, నాలుగు సమూహాల్లో మొదటి అక్షరంగా 'P' ఉంచినప్పుడు పై అక్షర క్రమం (లెటర్) కింది విధంగా ఏర్పడుతుంది.

P - R / PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే రెండు, మూడు, నాలుగు సమూహాల్లో రెండో అక్షరంగా 'Q' ఉన్నది. కాబట్టి మొదటి సమూహంలో కూడా రెండో అక్షరం 'Q' అవుతుంది. ఇప్పుడు మొదటి సమూహంలో 'Q'ను ఉంచితే పై అక్షర క్రమం(లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR /PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే మొదటి, నాలుగు అక్షర సమూహంలో మూడో అక్షరంగా R ఉన్నది. అందువల్ల రెండు, మూడో సమూహంలో కూడా మూడో అక్షరం R అవుతుంది. ఇప్పుడు రెండు, మూడో సమూహంలో మూడో అక్షరంగా R ఉంచితే పై అక్షర క్రమం (లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR / PQR / PQR /PQR

ఇప్పుడు అక్షర క్రమం పూర్తి అయింది. పైన ఖాళీలలో గల అక్షరాలు QPRRP ఇది సమాధానం అవుతుంది. ఆప్షన్స్‌లో QPRRP అనేది (బి)లో ఉన్నది. సమాధానం (బి) అవుతుంది.

మిగిలిన 6 నుంచి 18 వరకు ఉన్న పద్ధతుల్లో ఐచ్ఛికాల్లో ఇచ్చిన అక్షరాలను ఖాళీల్లో పెట్టుకొని జాగ్రత్తగా పరిశీలించి సమాధానాన్ని కనుగొనాలి. కాబట్టి ఇచ్చిన వివిధ రకాలైన సిరీస్ పద్ధతులను వీలైనన్ని ఎక్కువసార్లు గమనించి దాని కింద ఇచ్చిన వివరణల ఆధారంగా అవి ఏర్పడే విధానాలను అవగాహన చేసుకొని ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు గుర్తించండి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి DIKSUCHI

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ

ఇండియా వర్సెస్ భారత్ ఒక దేశం రెండు పేర్లు



భారత్ అనే పేరును రాజ్యాంగంలో చేర్చాలని 1949 సెప్టెంబరు 18న నిర్వహించిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో కొందరు సభ్యులు కోరారు. 74 సంవత్సరాలు గడిచిన తరవాత కూడా ఆ చర్చ కొనసాగుతూనే ఉంది. 2023లో భారతదేశంలో కీలకమైన జీ-20 శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ సన్నాహాల సందర్భంగా జరిగిన సంఘటనలు/ చర్చలతో ఈ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

అయితే ఈసారి చర్చను పరిష్కరించే అంబేద్కర్ లేరు. 2023 సెప్టెంబరులో జీ-20 సమావేశాల సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ-20 అతిథులకు పంపిన అధికారిక విందు ఆహ్వానంలో 'ద ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'కు బదులు 'ద ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించారు. సమావేశాలు నిర్వహించిన ప్రదేశానికి 'భారత మండపం' అని పేరు పెట్టారు. సమావేశాల్లో ప్రధాని ముందున్న నేమ్‌ప్లేట్‌పై భారత్ అని పేర్కొన్నారు. దీంతో 2023 సెప్టెంబరు 18న ప్రారంభమైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఇండియా పేరును భారత్‌గా అధికారికంగా రాజ్యాంగ సవరణ ద్వారా మార్చగలరనే ఊహాగానాలకు దారితీసింది. దీంతో ఒక్కసారిగా ఇండియా/భారత్ అనే పదాలపై ఒకింత ఆసక్తికరమైన చర్చ ప్రజాబాహుళ్యంలోకి వచ్చింది.

గతంలో ఈ అంశంపై మూడు సార్లు సుప్రీంకోర్టులో కేసులు దాఖలైనప్పటికీ, రాజ్యాంగ పరిషత్‌లో తప్ప మళ్లీ ఇంత పెద్ద ఎత్తున ప్రజాబాహుళ్యంలో ఎప్పుడూ చర్చకు రాలేదు. అయితే అందరూ ఊహించినట్లుగా పార్లమెంటులో ఈ అంశంపై ఎలాంటి తీర్మానం ప్రవేశపెట్టకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఈ అంశంపై రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల నుంచి నేటివరకు జరిగిన పరిణామాలను ఒకసారి పరిశీలిద్దాం.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర (యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

రాజ్యాంగ రచన విధానం

రాజ్యాంగాన్ని రూపొందించడం చాలా క్లిష్టమైన పని. సంక్షిప్తంగా చెప్పాలంటే రాజ్యాంగ పరిషత్ సభ్యులు ముందుగా రాజ్యాంగంలో ఏయే నిబంధనలను రూపొందించాలనే విషయాలను పరిశీలించి నివేదించడానికి అనేక కమిటీలను ఏర్పాటు చేశారు. తదనంతరం ఈ కమిటీలు తమ నివేదికలను సమర్పించాయి. వీటి ఆధారంగా వివిధ నిబంధనలను రూపొందించారు. వీటిని ఉపయోగించి రాజ్యాంగ సలహాదారు సర్ బి.ఎన్.రావు రాజ్యాంగ ముసాయిదాను సిద్ధం చేశారు. ఆ తరవాత ముసాయిదాను డ్రాఫ్టింగ్ కమిటీకి పంపారు. అది దానిపై చర్చించి అవసరమైన మార్పులు, చేర్పులను చేసింది. సవరించిన ముసాయిదాను అసెంబ్లీ, ప్రావిన్షియల్ లెజిస్లేచర్లు, ప్రావిన్షియల్ ప్రభుత్వాలు, మంత్రిత్వశాఖలు, ఫెడరల్ కోర్టు, హైకోర్టు సభ్యులకు పంపడంతోపాటు ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించడానికి అందుబాటులో ఉంచారు. వారు తమ సూచనలను సమర్పించారు. ఆ తరవాత ముసాయిదా కమిటీ ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దీనిని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునికి సమర్పించారు. ముసాయిదా రాజ్యాంగంపై సుదీర్ఘంగా చర్చించి, దానికి మార్పులు, చేర్పులు చేశారు. ఈ సవరణల ఫలితంగా భారత రాజ్యాంగం రూపుదిద్దుకుంది.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర(యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

భరత్‌వర్ష్ అని పేర్కొనాలి

ఆర్టికల్-1(1) కింద ఈ రాజ్యాంగం ప్రారంభమైన తేదీ నుంచి ఇండియా ఒక సమాఖ్యగా ఉంటుందని సలహాదారు సర్ బి.ఎన్.రావు పేర్కొన్నారు. అయితే బి.ఎన్.రావు ముసాయిదా పంపిణీ చేసినప్పుడు ఈ రాజ్యాంగం ప్రారంభం నుంచి భారతదేశం రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుందన్న వివరణను చేర్చాలని కేంద్ర రాజ్యాంగ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును చివరికి ముసాయిదా కమిటీ రూపొందించిన రాజ్యాంగ ముసాయిదాలో చేర్చారు. ఈ ముసాయిదాను సభ్యులకు సర్క్యులేట్ చేసినప్పుడు ఉపేంద్ర నాథ్ బర్మన్ ఇండియాకు బదులుగా 'భరత్‌వవర్ష్' అనే పదాన్ని డ్రాఫ్ట్ అంతటా ఉపయోగించాలని కోరారు. ఈ సూచనను ముసాయిదా కమిటీ తిరస్కరించింది. కారణం ఇండియా అనే పదం ప్రస్తుతం ఒకటిన్నర శతాబ్దాలకు పైగా వాడుకలో ఉండటమే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధి చెందింది. కాబట్టి ముసాయిదా అంతటా దానిని భరత్ వర్ష్‌గా మార్చడం మంచిది కాదని రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించిన చివరి ముసాయిదాలో ఇండియా అనే పదాన్ని ఉపయోగించారు.

ఆర్టికల్-1 : ఇండియా అది భారత్: ఆర్టికల్-1పై రాజ్యాంగ పరిషత్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. శిబ్బన్‌లాల్ సక్సేనా ఇండియాను భరత్‌వర్ష్ అని సంబోధించేలా అనేక సవరణలను ప్రవేశపెట్టారు. ఉదాహరణకు 1948 నవంబరు 15న 'యూనియన్ పేరు భారత్' అని ఒక సవరణను ప్రవేశపెట్టారు. అలాగే రాజ్యాంగ అధికారులను కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ ఇండియాగా కాకుండా, కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని కోరారు. అదేవిధంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను చీఫ్ జస్టిస్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని సవరణలను ప్రవేశపెట్టారు. అయితే ఆయన ప్రవేశపెట్టిన సవరణ తీర్మానాలన్నింటినీ రాజ్యాంగ పరిషత్ తిరస్కరించింది.

● 1949 సెప్టెంబరు 17న రాజ్యాంగ పరిషత్ సభా సమావేశం ముగియడానికి అరగంట మాత్రమే మిగిలి ఉంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇండియా అనే పేరును తాను ఇష్టపడతానని స్థిరంగా పేర్కొన్నాడు. చరిత్ర అంతటా, గత సంవత్సరాల్లో భారతదేశాన్ని ఇండియాగా పిలిచేవారు. 'యుఎన్‌లో సభ్యునిగా మన దేశం పేరు ఇండియా అని అనేక అంతర్జాతీయ ఒప్పందాలపై ఇండియా అనే పేరుతోనే సంతకం చేసిందని పేర్కొన్నాడు. అయితే ఆశ్చర్యకరంగా 1949 సెప్టెంబరు 17న ఆర్టికల్ '1'ని సవరిస్తూ 'ఇండియా అది భారత్' అని సవరణను ప్రవేశపెట్టారు. ఈ మార్పుపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎలాంటి వివరణను ఇవ్వలేదు.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



నవ్యాంధ్ర టూవీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా శిబిరం



విజయవాడలోని వరద ప్రభావిత రాజీవ్‌నగర్‌లో తాగునీటి సరఫరా



వైఎస్సార్ కాలనీలో ఇంటిని శుభ్రం చేసుకుంటున్న దృశ్యం

సీఎం కార్యక్రమంలో భద్రతా లోపం

» సిద్దరామయ్య పాల్గొన్న వేదిక పైకి దూసుకెళ్లిన యువకుడు

» విధానసౌధ ప్రాంగణంలో ఘటన

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొన్న సభావేదిక పైకి ఓ యువకుడు దూసుకెళ్లడం కలకలం రేపింది. ఆదివారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విధాన సౌధ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప మాట్లాడుతుండగా.. ఓ యువకుడు ఒక్కసారిగా వేదిక పైకి దూసుకువచ్చాడు. కన్నడ కండువా వేసుకున్న ఆ యువకుడు ఓ శాలువాను సీఎంపైకి విసరగా, ఆయన పక్కన ఉన్న వారిపై పడింది. ఆ యువకుడిని బెంగళూరులోని కనకపురకు చెందిన మహదేవ నాయక్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. అతను పలు ప్రశ్నలు వేస్తూ నినాదాలు చేశాడు. ఆ యువకుడు ఏం చెప్పదలచుకున్నాడనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీఎం పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ సీఎం సిద్దరామయ్య పాల్గొన్న రోడ్‌షోలో తుపాకి కలిగిన వ్యక్తి కనిపించడం చర్చకు దారితీసింది. బెంగళూరులో ఇటీవలే రామేశ్వరం కెఫెలో బాంబు పేలుడు జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విధానసౌధ ప్రాంగణంలో పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడం సంచలనమైంది. ఇలా తరచూ భద్రతా వైఫల్యాలు వెలుగులోకి వస్తుండడంతో సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.





వేదికపై సీఎం పక్కన పడిన కండువా, యువకుడిని అదుపులోకి తీసుకుంటున్న భద్రతా సిబ్బంది

పరప్పన జైలుపై సీసీబీ దాడి

» 18 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్, నగదు స్వాధీనం

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుపై సీసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. విల్సన్ గార్డెన్ నాగతో పాటు అతని సహచరుల నుంచి 18 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్, నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీసీబీ అధికారులు శనివారం దాడి చేసినట్టు ప్రకటించారు. నగర పోలీస్ కమిషనర్ దయానంద్ సూచన మేరకు దాడి జరిగినట్టు తెలుస్తోంది. ఆగస్టు 24న సీసీబీ అధికారులు పరప్పన జైలుపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే దర్శన్ జైలులో కాఫీ సేవిస్తూ, సిగరెట్ తాగుతూ నలుగురితో కలిసి కుర్చీలో కూర్చున్న ఫొటో వైరల్ అయింది. ఇలా తరచూ జైలుపై దాడులు చేస్తూ అక్రమాలను నివారించవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే దాడులు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే మునిరత్నకు రెండు రోజుల పోలీస్ కస్టడీ

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించారని, కంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలతో బెంగళూరు రాజరాజేశ్వరినగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నకు రెండు రోజుల పోలీస్ కస్టడీ విధించారు. శనివారం సాయంత్రం కోలారు జిల్లా ముళబాగిలు సమీపాన ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు రాత్రి బెంగళూరుకు తీసుకొచ్చారు. ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించి, న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. వారం రోజుల కస్టడీకి పోలీసులు కోరగా.. న్యాయమూర్తి రెండు రోజులకు అనుమతించారు. కాగా మునిరత్నపై చర్యల వెనుక రాజకీయ వేధింపులు లేవని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ సహా పలువురు వ్యాఖ్యానించారు. మరోమంత్రి సతీశ్ జార్కిహొళి మాట్లాడుతూ.. కులదూషణలు చేయమని తామేమైనా సూచించామా అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షనేత అశోక్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. హోం మంత్రి పరమేశ్వర్ కుట్రపన్ని మునిరత్నను అరెస్టు చేయించారని మండిపడ్డారు.

పాలస్తీనా జెండాతో యువకుల హల్‌చల్

తుమకూరు జిల్లా కుణిగల్‌లో పాలస్తీనా జెండా ఆవిష్కరించేందుకు గత నెల 15న ప్రయత్నించిన ఘటన మరువకముందే చిక్కమగళూరులో పాలస్తీనా జెండాతో ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు హల్‌చల్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఆదివారం చిక్కమగళూరు నగరంలోని ప్రధాన వీధుల్లో ఒకే వాహనంపై ముగ్గురు యువకులు పాలస్తీనా జెండాతో చక్కర్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో హిందూ కార్యకర్తలు చిక్కమగళూరు నగర పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలి వద్ద ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

ఏలేరు కాలువకు గండి

» వెంటనే స్పందించిన జీవీఎంసీ అధికారులు.. గండి పూడ్చివేత

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా), సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖ నగరానికి తాగునీరు సరఫరా చేసే కాలువకు గండి పడింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలికి సమీపంలో 99.6 కిలోమీటరు వద్ద ఆదివారం ఉదయం సుమారు పది మీటర్ల వెడల్పున భారీ గండిపడింది. అయితే పక్కనే జాగారాల గెడ్డ ఉండడంతో, నీరంతా దానిలోకి ప్రవహించడంతో పంట పొలాలు ముంపుబారిన పడలేదు. సమాచారం అందుకున్న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు వెంటనే స్పందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్లను రప్పించి ఇసుక బస్తాలు, సరుగుడు కర్రలతో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. కాగా, ఈ ప్రదేశంలో గతంలో కూడా పలుమార్లు గండ్లు పడినట్టు స్థానికులు చెబుతున్నారు. మాకవరపాలెం మండలంలో పలుచోట్ల ఏలేరు కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయని, గండ్లు పడే ప్రమాదం ఉన్నందున వీటిని పటిష్ఠం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

అమెరికా ఎన్నికల ర్యాలీలో డీకే శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఎన్నికల ర్యాలీలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. యూఎస్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం ఎన్నికల ర్యాలీని వీక్షించే అద్భుత అవకాశం లభించిందని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇక్కడ ఎన్నికల ర్యాలీని చూసినపుడు ఎంతో నేర్చుకోవాలని అనిపించిందని పేర్కొన్నారు. ప్రజాశక్తి, ఉత్సాహం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. ఈ మహత్తరమైన కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా మరిన్ని విషయాలు నేర్చుకోవాలని ఎదురు చూస్తున్నానని తెలిపారు. డీకే శివకుమార్ ఈ నెల 8న అమెరికా పర్యటనకు వెళ్లారు.

మిత్రులతో గడపాలని భర్త వేధింపులు

» ససేమిరా అన్నందుకు దారుణహత్య

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తన మిత్రులతో గడపాలని, అంతవరకు తాకేది లేదని భార్యను వేధించినా ఆమె ససేమిరా అనడంతో దారుణంగా హత్యచేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాదగిరి జిల్లా శహపుర తాలూకా గంగనాళ గ్రామానికి చెందిన శరణ బసమ్మ (25) జూలైలో హత్యకు గురికాగా.. పోలీసులు ఈ కేసును తాజాగా ఛేదించారు. శరణబసమ్మకు హుణసగి గ్రామక్యాంపులో నివసించే భీమణ్ణ (32)తో 14 నెలల క్రితం వివాహమైంది. మూడు నెలలపాటు అన్యోన్యంగా గడిపారు. ఆ తర్వాత 'నిన్ను తాకాలంటే నా మిత్రులతో గడపాలి' అని ఆమెను భీమణ్ణ వేధించేవాడు. జూలైలో భార్యతో పాటు ఆమె పుట్టినిల్లు గంగనాళ గ్రామానికి వెళ్లిన భీమణ్ణ తలగడతో ఊపిరి ఆడకుండా చేసి శరణ బసమ్మను హత్యచేశాడు. స్పృహ కోల్పోయిందంటూ బంధువులతో కలిసి ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా.. మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా ఆమె మృతి అసహజంగా ఉందని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె మృతికి సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక ఇటీవల రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సొంతూరిలో హత్యచేస్తే పట్టుబడతానని, పుట్టింటిలోనే భార్యను చంపి ఆ తర్వాత ఏమీ తెలియనివాడిలా నటించాడు. చివరకు ఫోరెన్సిక్ నివేదికలో గొంతు నులమడంతో ఊపిరి ఆగినట్టు తేలడంతో భీమణ్ణను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించడంతో హత్య చేసినట్టు అంగీకరించాడు. ఈ మేరకు గోగి పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

3 ఏళ్లు.. 5 వేల వీసాలు.. రూ. 300 కోట్లు

» ఢిల్లీలో నకిలీ వీసా రాకెట్ గుట్టు రట్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు నకిలీ వీసాలు సృష్టిస్తున్న ముఠా ఆటలను కట్టించారు. హరియాణాకు చెందిన సందీప్ అనే వ్యక్తి స్వీడన్ వెళ్లేందుకు ఆదివారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. ఇమ్మిగ్రేషన్ చెక్‌లో సందీప్ వద్ద ఉంది నకిలీ వీసా అని అధికారులు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన ప్రాంతం నుంచి చాలా మంది ఇలాగే నకిలీ వీసాలతో విదేశాలకు వెళ్లినట్లు చెప్పాడు. తాను ఆసిఫ్ అలీ అనే ఏజెంట్‌కు రూ. 10లక్షలిచ్చి ఈ నకిలీ వీసాను పొందినట్లు చెప్పాడు. పోలీసులు ఆసిఫ్ అలీని అరెస్టు చేసి విచారించగా అతడు మరో ఇద్దరి పేర్లు చెప్పాడు. ఇలా మొత్తం ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. గ్రాఫిక్ డిజైనింగ్ వచ్చిన మనోజ్ మోంగా అనే వ్యక్తి ఈ ముఠాలో కీలక పాత్రను పోషిస్తున్నట్లు తెలుసుకున్నారు. అతను ఢిల్లీలోని తిలక్‌నగర్‌లో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని అందులో యంత్రాలు పెట్టి వాటి ద్వారా నకిలీ వీసాలను రూపొందిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అతడు మూడేళ్లలో 5 వేలకు పైగా నకిలీ వీసాలు రూపొందించాడని, దానికి గాను రూ. 300 కోట్లు ఆర్జించాడని పోలీసులు తెలిపారు. ఒక నెలలో అతడు 30 నుంచి 60 నకిలీ వీసాలను తయారు చేస్తాడని, ఒక్కో వీసాను రూ. 8 నుంచి 10 లక్షలకు విక్రయిస్తాడని చెప్పారు. జైదీప్ సింగ్ అనే వ్యక్తి మనోజ్‌కు ఈ పని నేర్పించి యంత్రాలు సరఫరా చేసినట్లు తెలుసుకుని అతడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆదర్శనీయుడు ఆచార్య రోణంకి


రోణంకి అప్పలస్వామి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

టెక్కలి: బహుభాషా కోవిదుడు, టెక్కలిని అంతర్జాతీయ సాహితీ ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి ఆచార్య రోణంకి అప్పలస్వామి అని, ఆయనను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని డా.బీఆర్ఏయూ అధ్యాపకుడు డాక్టర్ బీవీ రమణమూర్తి అన్నారు. రోణంకి అప్పలస్వామి 115వ జయంతి సందర్భంగా ఆదివారం రిటైర్డ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రమణమూర్తి మాట్లాడుతూ.. ఇంగ్లీష్, ఫ్రెంచ్, స్పానిష్, గ్రీక్, హిబ్రూ, ఇటాలియన్ తదితర ఆరు యూరోపియన్ భాషల్లో అప్పలస్వామి మాస్టారు నిష్ణాతులన్నారు. శ్రీశ్రీ, ఆరుద్రలకు తొలి రోజుల్లో స్ఫూర్తినిచ్చారని, అల్లసాని పెద్దన, బట్టుమూర్తి, క్షేత్రయ్య, నారాయణబాబు, చావలి బంగారమ్మ, చాసో తదితర కవితలను ఆంగ్లీకరించి దేశ, విదేశీ భాషా పత్రికల్లో ప్రచురించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రోణంకి రామచంద్రరావు, బొడ్డ అయ్యబాబు, వర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ లీలా వరప్రసాద్, సంఘ నేతలు కె.ధనుంజయరావు, డాక్టర్ జగన్నాథరావు, జీవీ రెడ్డి, చంద్రశేఖర్ పట్నాయక్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన గుజ్జు విలియమ్స్, హనుమంతు శివానంద, డి.సూర్యకాంతం, ఎస్.సురేష్‌కుమార్, తులసీప్రసాదరావులను సత్కరించారు.

ఉన్నత లక్ష్యాలకు ప్రణాళికలు వేసుకోవాలి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ శాస్త్రవేత్త గోపీకృష్ణ

నరసన్నపేట: వసతిగృహాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని డీఆర్‌డీవో సీనియర్ శాస్త్రవేత్త, డిప్యూటీ పీడీ డా.గోపీకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు విద్యార్థి దశ నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రమణ సాహు, రంగనాథ్, శ్రీనివాసశర్మ, హేమచలం, ఉణ్న వెంకటేశ్వరరావు, వసతిగృహ సంక్షేమాధికారి పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలకు మళ్లీ ఊతం

- గ్రామాల్లో ఏర్పాటుకు సహకారం
- వైసీపీ హయాంలో నిర్వీర్యం
- కూటమి ప్రభుత్వంలో పెంపకందారులకు భరోసా


టీడీపీ ప్రభుత్వ హయాంలో అక్కరాపల్లిలో నిర్మించిన మినీ గోకులం షెడ్డు (ఫైల్)

(హిరమండలం)

వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడం ద్వారా అటు రైతులను, ఇటు పాడి రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే దిశలో కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తద్వారా ఆయా రంగాల్లో పురోగతి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. వ్యవసాయ అనుబంధ రంగానికి ఉపాధి హామీని అనుసంధానం చేయడం ద్వారా ఆ నిధులతో మినీ గోకులాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. గతంలో 2018లో రైతులకు వ్యవసాయంలో నష్టం వచ్చినా పాడిలో లాభాలు వచ్చేలా మినీ గోకులాలను ప్రారంభించింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నీరు గార్చింది. పాడి గేదెల కొనుగోలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. తాజాగా ఈ మినీ గోకులాల పథకాన్ని పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను మండలాలకు చేరవేసింది. ఈ పథకంలో గ్రామీణ యువతకు, మహిళలకు ఉపాధి కల్పన, పశుసంపద పెంపునకు దోహదం చేస్తుందనే ఉద్దేశం తో మళ్లీ ఈ పథకాన్ని అమలుచేస్తోంది. ఈ పథకంలో గొర్రెల పెంపకం, కోళ్ల పరిశ్రమ, పాడి గేదెల సంరక్షణ చేపట్టాల్సి ఉంటుంది. పశు పోషకులకు 90 శాతం, కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకందారులకు 70 శాతం రాయితీపై షెడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది.

పశువుల పెంపకం మూడు విధాలుగా..

పాగి గేదెల షెడ్డు నిర్మాణం మూడు రకాలుగా పేర్కొంది. రెండు గేదెల పెంపకానికి ఉపకరించే షెడ్డుకి రూ.1.15 లక్షలు, నాలుగు గేదెలకు రూ.1.85 లక్షలు, ఆరు గేదెల గోకులం నిర్మాణానికి రూ.2.30 లక్షలు నిధులు కేటాయిస్తుంది. షెడ్డు నిర్మాణ వ్యయంలో 90 శాతం రాయితీని ప్రభుత్వ భరిస్తుంది.

గొర్రెల షెడ్డు నిర్మాణానికి..

50 గొర్రెల పెంపకానికి అనువైన షెడ్డు నిర్మాణానికి రూ.1.50 లక్షలు, 100 గొర్రెల పెంపకానికి అను వైన షెడ్డు నిర్మాణానికి రూ.2.30 లక్షలు నిధులు కేటాయిస్తుంది. గోకులం నిర్మాణం చేపట్టిన లబ్ధిదారు లకు ప్రభుత్వం ఈ మొత్తంలో 70 శాతం రాయితీగా అందించనుంది.

కోళ్ల పెంపకానికి..

వంద కోళ్లను పెంచేందుకు గాను షెడ్డు నిమిత్తం రూ.87 వేలు, 200 కోళ్ల షెడ్డు నిర్మాణానికి రూ. 1.32 లక్షల నిధులు కేటాయిస్తుంది. ఈ మొత్తంలో 70 శాతం రాయితీని ప్రభుత్వం లబ్ధిదారులకు సమ కూరుస్తుంది. జిల్లాలో ఆవులు 4,56,291, గేదెలు 40,477, గొర్రెలు 6,23,641, మేకలు 2,77,268 ఉన్నట్లు అంచనా.

ఈ గోకులాలకు అర్హులెవరంటే..

ఈ పథకంలో లబ్ధి పొందాలంటే 'ఉపాధి' జాబ్ కార్డు తప్పనిసరి. కుటుంబంలో ఒక్కరైనా ఉపాధి పథకంలో పని చేస్తుండాలి. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు, గిరిజనులకు, దివ్యాంగులకు, భూమి కోల్పోయిన కుటుంబాలకు, పీఎంఏవై లబ్ధిదారులకు, పేదరికానికి దిగువన ఉన్న వారికి, కుటుంబ యజమానులుగా ఉన్న మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది లక్ష్యం. క్షేత్రస్థాయిలో గోకులాల్లో పశు పోషకుల గుర్తింపు దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

మంజూరైన గోకులం వివరాలిలా..

శ్రీకాకుళం డివిజన్‌లో ఆమదాలవలస, శ్రీకాకుళం, రణస్థలం, ఎచ్చెర్ల 36 చొప్పున, గార 35, కొత్తూరు, నరసన్నపేట, పోలాకి, పొందూరు, జి.సిగడాం, లావేరు, సరుబుజ్జిలి, బూర్జ కు 34 చొప్పున, ఎల్.ఎన్.పేటకు 30 మంజూరయ్యాయి. టెక్కలి డివిజన్‌లో ఇచ్ఛాపురం, కవిటి, జలుమూరు, పలాస, సోంపేట, కంచిలికి 34 చొప్పున, నందిగాం 40, వజ్రపు కొత్తూరు, మందస, పాతపట్నంలకు 35 చొప్పున, మెళియాపుట్టి, సారవకోటకు 32 చొప్పున, హిరమండలం 30, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళిలకు 42 చొప్పున మంజూరయ్యాయి. జిల్లా మొత్తం టెక్కలి డివిజన్‌లో 569, శ్రీకాకుళం డివిజన్‌లో 481 మంజూరైనట్లు అధికారులు తెలిపారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



మినీ గోకులం పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి జాబ్ కార్డులున్న చిన్న, సన్నకారు రైతులు అర్హులు. రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయ కార్యాలయం, పశు వైద్య శాలల్లో దరఖాస్తులున్నాయి. పూర్తిచేసిన దరఖాసుతో పాటు ఆధార్ జిరాక్స్, జాబ్‌కార్డు, షెడ్డు స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు పాస్ పుస్తకం అందించాలి.

-మురళీధర్, జేడీ,పశు సంవర్థక శాఖ, శ్రీకాకుళం


సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

నందిగాం: పెద్దతామరాపల్లి దత్తవేదిక ఆవరణలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మహాగణపతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. దత్త బృందం ఆధ్వర్యంలో పురోహితులు మావడి శ్రీనివాస్‌శర్మ, సింహాచలం శర్మలతో పాటు 8 మంది రుత్వికుల వేదమంత్రాల నడుమ పలువురు దంపతులు హోమం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. అలాగే పలు గ్రామాల్లో గణనాథుని నిమజ్జనోత్సవాలు యువత ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు.

రావివలసలో గణపతి లడ్డూ రూ.లక్ష


లింగాలవలస నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు

టెక్కలి: రావివలసలో గణనాథుని లడ్డూ ఆది వారం రాత్రి వేలంపాట నిర్వహించగా గ్రామానికి చెందిన బడే వరాహ శంకరరావు రూ.లక్షకు సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. ● లింగాలవలసలో చిన్నారుల కోలాటం ప్రదర్శన, యువత సందడితో గణేశ్ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. డీజే సౌండ్లు లేకుండా భక్తి పారవశ్యంతో కోలాటానికి ప్రాధాన్యం ఇవ్వడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేశారు. అంతకుముందు నిర్వహించిన లడ్డూ వేలం పాటలో గ్రామానికి చెందిన సీమలవలస చిన్నవాడు రూ.46 వేలకు, స్వామివారి కండువాను లాబాల రుక్మాంగధరావు రూ.25 వేలకు దక్కించుకున్నారు.

అవలింగిలో రూ.51 వేలు..

జలుమూరు (సారవకోట): అవలింగి గ్రామంలో శ్రీ విజయ గణపతి ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం లడ్డూ వేలం వేశారు. గ్రామస్థుడు వారణాసి శ్రీనివాసరావు రూ.50,116లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. అర్చకులు మావుడూరు జానీప్రసాద్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా మహాగణపతి హోమం

బెండిలో రూ.46 వేలు..

వజ్రపుకొత్తూరు: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బెండి గ్రామంలో శనివారం రాత్రి లడ్డూ వేలం నిర్వహించారు. గ్రామస్థుడు దాసరి గున్నయ్య రూ.46 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

మూలపేటలో రూ.32 వేలు

సంతబొమ్మాళి: మూలపేట గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుని ఉత్సవాల్లో భాగంగా లడ్డూ రూ.32 వేలకు గ్రామస్థుడు జీరు గజేంద్ర దక్కించుకున్నారు. మండలం లోని నౌపడలో వినాయక నవరాత్రుల సందర్భంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతికి ప్రత్యేక పూజలు


సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు

ఎల్.ఎన్.పేట: చిన్నకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ఆదివారం పురోహితుడు భాస్కరభట్ల సాయినిఖిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున మహిళలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పలు గ్రామాల్లో గణేశుని నిమజ్జనం


జమ్ములో నిమజ్జనానికి వెళుతున్న దృశ్యం

నరసన్నపేట: వినాయక నవరాత్రుల సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులను ఆదివారం ఆయా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేపట్టారు. నాయుడు వీధిలో నారాయణ సేవ చేశారు. జమ్ము, కంబకాయి, మాకివలస, ఉర్లాం, నడగాం, బొరిగివలస తో పాటు పట్టణంలో గణనాథుని నిమజ్జనం చేపట్టారు.

విజయ గణపతికి పుష్పాభిషేకం


గులాబీలతో స్వామికి అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులోని ఉన్న విజయ గణపతి ఆలయంలో స్వామికి ఆదివారం తొమ్మిది రకాల పూలతో అభిషేకం నిర్వహించారు. అర్చకులు పెంటా శ్రీధర్ శర్మ, సూర్య నగేష్ శర్మ ఆధ్వర్యంలో విశేష హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పట్టణవాసులు స్వామిని దర్శించుకున్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన


వెదుళ్లవలసలో చిన్నారుల కోలాట ప్రదర్శన

వెదుళ్లవలస (పోలాకి): వెదుళ్లవలస గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద ఆదివారం రాజారాంపురం గ్రామానికి చెందిన విద్యార్థినులు చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. పోలాకి, అంపలాం, పిన్నింటిపేట, వెదుళ్లవలస, అంబీరుపేట, గాతలవలస, దువ్వవలస, దీర్ఘాశి, ఈదులవలస సుసరాంకాలనీల్లో గణపతి నవరాత్రుల సందర్భంగా అన్న వితరణ చేపట్టారు. మబగాంలోని పలు వీధుల్లో ఏర్పాటు చేసిన గణ నాథులను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

చెస్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానం

టెక్కలి: తేలినీలాపురంలో గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో కె.కల్పక్ (పలాస) ప్రథమ, జయరాజ్ (శ్రీకాకుళం) ద్వితీయ, వెంకటేష్ తృతీయ స్థానం సాధించారు. అలాగే అండర్-7 విభాగంలో కెలిపిక ప్రథమ, ఎస్.రిత్విక్ ద్వితీయ స్థానాలు, అండర్- 9 విభాగంలో జైచరణ్ వీర్ ప్రథమ, పార్థివ్ ద్వితీయ స్థానం సాధించారు. బాలికల విభాగంలో స్ఫూర్తి ప్రథమ, దీపిక ద్వితీయ స్థానం పొందారు. వీరికి చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సనపల భీమారావు, కమిటీ సభ్యులు వెంకటరమణమూర్తి, తవిటినాయుడు, సంతోష్, కృష్ణారావు, అనీల్‌రాజ్, వసంత్ నగదు బహుమతులను అందజేశారు.

హిందీ ప్రచార సభ పరీక్షలకు 122 మంది హాజరు

జలుమూరు: కరవంజ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన హైదరాబాద్ హిందీ ప్రచార సభ పరీక్షలకు 122 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో బి.మాధవరావు తెలిపారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు జారీచేస్తామన్నారు. ఈ పరీక్షలను హెచ్‌ఎం టి.ప్రసాదరావు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

నూతన ఆవిష్కరణపై దృష్టి సారించాలి


విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి: ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కేఎంవీ, హైదరాబాద్ ప్రాజెక్ట్ వైస్‌ప్రెసిడెంట్ హరేరామ్ పెందుర్తి అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం ఇంజనీర్ల దినోత్సవాన్ని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉద్దానం నీటి ప్రాజెక్ట్ డీఈ దుప్పల ఆశాలత, కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, కన్వీనర్ దినకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒడిశా

అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి

పర్లాకిమిడి: అన్ని శాఖల పమన్వయంతో అభివృద్ధి సాధ్యపడుతుందని కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్ అన్నారు. ఆదివారం కలెక్టర్ సమావేశ భవనంలో జిల్లాస్థాయి అభివృద్ధి మేళా సన్నాహక సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20 నుంచి 22 వరకు గజపతి స్టేడియంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ఈ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. అదనపు జిల్లా కలెక్టర్ రాజేంద్ర మింజ్, జడ్పీ సీఈవో గుణనిదినాయక్, డీఎస్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సుభద్ర పథకం స్వాగత పాదయాత్ర


పాదయాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి టౌన్‌హాల్ వద్ద జిల్లా స్థాయి సుభద్ర పథకం అవగాహన స్వాగత పాదయాత్ర ఆదివారం స్వయంశక్తి సహాయక సంఘాల మహిళలు నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని కలెక్టర్ బిజయ్ కుమార్ దాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్ర టౌన్ హాల్ నుంచి ప్రారంభమై బిజూ కల్యాణ మండపం వరకు సాగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సుభద్ర పథకాన్ని ప్రారం భిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యనిర్వహణాకారి గుణనిది నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

పర్లాకిమిడి: స్థానిక భవానీ టాకీస్ వద్ద ఏర్పాటు చేసిన వినాయ మండపంలో ఆదివారం సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. 100 రకాల వంటకాలతో స్వామికి నైవేద్యం సమర్పించారు. పలువురు స్థానికులు స్వామిని దర్శించుకున్నారు.

స్టెప్పులతో అదరగొట్టిన అప్పలరాజు దంపతులు


భార్య శ్రీదేవితో కలిసి డ్యాన్స్ చేస్తున్న డా.అప్పలరాజు

పలాస: మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు వినాయక నిమజ్జనం సందర్భంగా స్టెప్పులు వేసి అదరగొట్టారు. రెండు రోజుల కిందట జరిగిన ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అయింది. ఆయన నివాసం ఉంటున్న జీఎంఈ కాలనీలో వినాయచవితి వేడుకలు నిర్వహిం చారు. శుక్రవారం రాత్రి నిమజ్జనం చేపట్టగా కాలనీలోని వారంతా కుటుంబ సభ్యు లతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు దంపతులు పల్సర్ బైక్ పాటకు డ్యాన్స్ చేసి అలరించారు. జీఎంఈ కాలనీ ఏర్పడిన నాటి నుంచి వినాయక చవితి వేడుకలు ఆనవాయితీ. ప్రతి ఏటా నిమజ్జనంలో అప్పలరాజు దంప తులు పాల్గొని అందర్నీ ఉర్రూతలూగిస్తుంటారు. ఆయన స్టెప్పులకు మంచి స్పందన వచ్చింది.

కిడ్నీ వ్యాధిగ్రస్థుడికి పూర్వ విద్యార్థుల సాయం

వజ్రపుకొత్తూరు: ఒంకులూరు గ్రామానికి చెందిన లైసెట్టి డిల్లీశ్వరరావు కిడ్నీవ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని సహచరులు రూ.31,700 నగదును అందించారు. 1993-94లో ఒంకులూరు హైస్కూల్‌లో పదో తరగతి చదవుకున్న వీరు తోటి మిత్రుడి ఇబ్బందులను గుర్తించి ఈ సాయం అందించారు. అలాగే సింహాద్రి సురేష్ కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందగా కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు రూ.6500 నగదును మృతుడి కుటుంబానికి అందించారు. లక్కోజు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు

ఎల్.ఎన్.పేట: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏచూరి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను పుణికి పుచ్చుకొని అంచెలంచెలుగా జాతీయ స్థాయి నేతగా సీతారాం ఏచూరి ఎదిగారన్నారు. ప్రజా సమస్యలపై నిరం తర పోరాటాలు చేశారన్నారు. ఆయన మృతితో దేశం ఏ జాతీయ నేతను కోల్పోయిందన్నారు. ఆ పార్టీ నేతలు ఎస్.సింహాచలం, జి.వెంకటరమణ, ఎ.జీవరత్నం, ఎం.గోవిందరావు, కె.సంతోష్, శంకరరావు పాల్గొన్నారు.

రసవత్తరంగా రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలు


పోటీ పడుతున్న క్రీడాకారులు

వజ్రపుకొత్తూరు: రాష్ట్రస్థాయి టెన్నీ కాయిట్ పోటీలు వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణ లో రసవత్తరంగా సాగుతున్నాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన బాలబాలికలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. రెండో రోజు ఆదివారం సెమీ ఫైనల్‌కు చేరిన జాబితాను పీఈటీ పి.గజేంద్రరావు ప్రకటించారు. బాలుర విభా గంలో ఎన్. గౌతం, సంజయ్, కేఎస్ శంకర్ ప్రసాద్ (తూర్పుగోదారి), పి.మహీధర్ (అనంతపురం), ఎస్.సాయి కుమార్ (విజయనగరం) సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు.

అలాగే బాలికల విభాగంలో కె.జ్యోతిక, హెచ్. స్పందన, హెచ్.దీక్షిక (అనంతపురం), ఆర్.సంస్కృతి (పశ్చిమ గోదావరి) సెమీస్‌కి చేరారు. సోమవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగు తాయన్నారు. సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

కొత్తూరు: మండలంలోని బిట్-3 ఇరపాడు గ్రామంలో ఆదివారం ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కరణం దాసు(70) దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎంతకీ ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దాసుకి భార్యతో పాటు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైం: స్థానిక పాత బస్టాం డ్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ మేరకు స్థానికులు 1వ పట్టణ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ హరికృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. అయితే గడచిన మూడు నెలలుగా ఇదే ప్రాంతంలో ఆ వ్యక్తి భిక్షాటన చేస్తున్నట్టు స్థానికులు ఎస్ఐకు తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు. పోలీసులకు సమాచారం అందించిన వడ్డి మోహనరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి: మండల పరిధిలోని జాతీయరహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నందిగాం మండలం బ్రిడ్డిపల్లికి చెందిన పంద్ర నర్సింహులు, తన భార్య సరస్వతితో కలిసి ద్విచక్ర వాహనంపై కోటబొమ్మాళి వస్తుండగా ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యభర్తలిద్దరూ గాయపడ్డారు. వెంటనే వీరిని స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

'ఎచ్చెర్ల'లో మరో వ్యక్తికి..

ఎచ్చెర్ల: ఎచ్చెర్ల పంచాయతీ రామ్‌నగర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామ్‌నగర్‌కు చెందిన జరుగుళ్ల భాస్కరరావు(40) ద్విచక్ర వాహనంపై ఎచ్చెర్ల నుంచి తన ఇంటికి వస్తుండగా అదుపు తప్పి పడిపోయాడు. దీంతో ఆయన తలకు గాయాలయ్యాయి. వెంటనే అతడి తొలుత శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి.. అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ వి.సందీప్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

ఎచ్చెర్ల: అల్లినగరం గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి అదృశ్యమైనట్టు ఆమె తండ్రి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆ యువతి శనివారం కళాశాలకు వెళ్తానని చెప్పి.. తిరిగి ఇంటికి చేరలేదని ఆ ఫిర్యాదులో ఆమె తండ్రి పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **నరసన్నపేట:** ఇంటర్ చదువుతున్న ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సారవకోట మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. శనివారం ఆ యువతి కళాశాలకు వెళ్లింది. సాయంత్రానికి ఆమె ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మూడు టిప్పర్లు స్వాధీనం

జలుమూరు: మాకివలస ఇసుక ర్యాంపు నుంచి ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో ఆదివారం తెల్లవారుజామున నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో వచ్చి ఇసుక ర్యాంపు వద్ద ఉన్న 3 టిప్పర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం పరచుకొని జలుమూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆక్రమణలు తొలగిస్తాం


ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లావేరు: తామాడ కొండ ఆక్రమణపై ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'రూ.10 కోట్లు భూమి హాంఫట్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. తామాడ కొండ వద్ద సర్వే నెంబరు 29లో ఆక్రమణలకు గురైన స్థలాన్ని ఆదివారం తహసీల్దార్ వై.జోగారావు, ఆర్ఐ బాలు, వీఆర్వో రామయ్య ఆక్రమణలకు గురైన స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ భూమి ఆక్రమణదారులకు సోమవారం లావేరు తహసీల్దార్ కార్యాలయానికి రావాలని వీఆర్వో రామయ్య ద్వారా నోటీసులను జారీ చేశారు. ఆక్రమణలను పూర్తి స్థాయిలో ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

ధారణావాచస్పతి ఓరుగంటికి 'మహతి' పురస్కారం


ప్రసాద్‌కు పురస్కారం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులోని ఉపనిషన్మందిరంలో ఆదివారం మహతి సాహితీ సంస్థ 26వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కోదండరామాలయ ప్రాంగణంలో విశాఖకు చెందిన ధారణా వాచస్పతి, ప్రముఖ ఆధ్యాత్మిక, సాహితీవేత్త ఓరుగంటి రాజరాజేశ్వరీ ప్రసాద్‌కు మహతి సాహితీ పురస్కారాన్ని సంస్థ అధ్యక్షుడు డా.ఇ.ఎస్.సంపత్‌కుమార్, మందిరం అధ్యక్షుడు గుమ్మా నగేష్, డా.బి.కోమలరావు అందించారు. దుశ్శాలువా, నగదు పురస్కారంతో సత్కరించారు. సాహిత్యరంగంలో ఓరుగంటి చేస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. అనంతరం వామన జయంతి సందర్భంగా రాజరాజేశ్వరీ ప్రసాద్ వామన చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ఉపనిషన్మందిరం ప్రతినిధులు నిష్టల నర్సింహమూర్తి, పతంజలి శాస్త్రి, డా.పులఖండం శ్రీనివాసరావు, డా.మందుల మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం


నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

బూర్జ: పెద్దకురింపేట గ్రామానికి చెందిన గూన సింహాచలం పరిస్థితిని తెలుసుకున్న తోటి స్నేహితులు ఆ కుటుంబానికి రెండు నెలలకు పడా నిత్యావసర సరుకులను ఆదివారం అందించారు. డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణ, ఉదయ బాలచంద్ర, వావిలపల్లి అచ్యుతరావు, బొడ్డు సింహాచలం, ఏవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన చిన్ననాటి స్నేహితులందరికీ సింహాచలం కృతజ్ఞతలు తెలిపారు.

దసరా నవరాత్రి ఉత్సవాల శుభరాట



ఇచ్ఛాపురం: గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శుభరాట వేడుకగా జరిపారు. ఆదివారం వేదపండితులు సన్యాసిపాడి శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. దసరా నవరాత్రి ఉత్సవాలు వచ్చే నెల మూడు నుంచి 11 వతేదీ వరకు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.


ఎచ్చెర్ల: శివానీ కళాశాలలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ తదితరులు


అరసవల్లి: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్


శ్రీకాకుళం కల్చరల్: విశ్వేశ్వరయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

అరసవల్లి: దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఇంజనీర్ల పాత్ర కీలకమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేటు హోటల్‌లో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, శ్రీకాకుళం అధ్యక్షుడు ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇంజనీర్స్ వి.సుధాకర రావు, పి.శ్రీహరి, వీవీ నరసింహారావు, సీహెచ్ రమేష్, ఐ.సత్యనారాయణరాజు, ఎం.వెంకటకృష్ణ, ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

భరతజాతి ముద్దుబిడ్డ..

అరసవల్లి: భారతజాతి గర్వించదగ్గ మహనీయుడు, ముద్దుబిడ్డ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఇంజనీర్‌గా దేశ పేరు ప్రఖ్యాతులను ప్రపంచం నలుదిశలా చాటారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అరసవల్లిలో గల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వెల్ఫేర్ ఇంజనీర్స్ టెక్నికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య జయంతి ఆదివారం నిర్వహించారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముని శ్రీనివాస్, దుంగ సుధాకర్, విజయకుమార్, సతీష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మందిరంలో..

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ మందిరంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా విగ్రహదాత హారిక ప్రసాద్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాండ్రంగి శ్రీనివాసరావు, పైడి హరినాథ్, నరసింహమూర్తి పాల్గొన్నారు.

ముందడుగు వేయాలి

ఎచ్చెర్ల: దేశానికి మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవల స్ఫూర్తితో యువ ఇంజనీర్లు ముందడుగు వేయాలని ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం క్యాంపస్‌లో ఇంజనీర్స్ డే నిర్వహించారు. జలవనరుల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్‌ను సత్కరించారు. ఏవో రామకృష్ణ, అకడమి క్ డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి తేజ్‌కిరణ్, సివిల్ ఇంజనీర్ సురేష్, పీఆర్వో మామిడి షన్ముఖ పాల్గొన్నారు. అనంతరం సహాయమిత్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.

యువత పాత్ర కీలకం

ఎచ్చెర్ల: సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకమని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో ఆదివారం నిర్వహించిన ఇంజనీర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాల ఆవరణలో నిర్మించిన బుర్జ్ ఖలీఫా ఆకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జలవనరుల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్, కొండా రవికుమార్‌ను సత్కరించారు. జేఎన్‌టీయూ (విజయనగరం) పాలక మండలి సభ్యుడు దుప్పల వెంకటరావు, కళాశాల యాజమాన్య సభ్యులు పి.దుర్గాప్రసాద్‌రాజు, జె.హరీష్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు. కళాశాల ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు


కేంద్రమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి: కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం జిల్లాకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధి పనులు విషయమై శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కేంద్ర మంత్రిని కలిసి పలు అంశాలపై చర్చించారు. వీరితోపాటు శ్రీకాకుళం నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కూటమితోనే అభివృద్ధి సాధ్యం


పరామర్శిస్తున్న కళావెంకటరావు

జి.సిగడాం: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చీపురుపల్లి ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు అన్నారు. టీడీ వలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సాసుబిల్లి గోపాలనాయుడు తండ్రి గణపతిరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఆయన ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు కుమరాపు రవికుమార్, బెవర జగన్నాథరావు, నక్క మురళీ, పైల బాబ్జీనాయుడు, టంకాల కిశోర్, టంకాల విజయ్‌బాబు, బి.చినబాబు, మజ్జి కన్నంనాయుడు ఉన్నారు.

గ్రోయిన్స్ మంజూరు చేయాలని వినతి


ఎంపీ కలిశెట్టికి సమస్యను వివరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: నాగావళి తీరానికి ఆనుకుని ఉన్న పొన్నాడ పంచాయతీలో గ్రోయిన్స్ నిర్మించి రైతులను ఆదుకోవాలని నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పంచిరెడ్డి కృష్ణారావు ఆదివారం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందించారు. ఏటా కొంత మేరకు జిరాయతీ భూములు నాగావళి నదిలో కలుస్తున్నాయని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని ఎంపీకి వివరించారు. గ్రోయన్స్‌ను నిర్మిస్తే ఈ ప్రాంత రైతుల కష్టాలు గట్టెక్కుతాయని ఎంపీకి వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రోయన్స్ మంజూరుకు కృషిచేస్తానని ఎంపీ హామీనిచ్చారు.

అన్నసమారాధనలో ఎమ్మెల్యే, ఎంపీ

రణస్థలం: బంటుపల్లి గ్రామంలో వినాయక నవరాత్రుల వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం జరగిన అన్నసమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు హాజరయ్యారు. సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. 12 కిలోల వినాయక లడ్డూను వెలిచేటి సురేష్‌కుమార్ బృందం రూ.50 వేలుకు వేలం పాటలో దక్కించుకున్నారు. సర్పంచ్ నడుకుదిటి రజినిఎస్ఈఆర్, తేజాబాబు, చంటిబాబు, వరహామూర్తి, రాజశేఖర్ పాల్గొన్నారు.

● యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆయన స్వగ్రామం వీఎన్ పురంలో ఆదివారం జరిగిన అన్నసమారాధనలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కలిశెట్టి సూర్యనారాయణ, రామారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్విజ్ విజేత కొత్తపల్లి హైస్కూల్


సోంపేట: పలాసపురం గ్రామంలో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీ కొత్తపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీల్లో 66 జట్లు పాల్గొనగా, స్క్రీనింగ్ ద్వారా మొదటి పది స్థానాల్లో నిలిచిన జట్లకు నిర్వహించిన ఫైనల్ పోటీల్లో మందస మండలం కొత్తపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో జిల్లా పరిషత్ హైస్కూల్ హరిపురం, మూడో స్థానంలో కవిటి ప్రభుత్వ హైస్కూల్ జట్లు నిలిచాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను ఎంపీడీవో బి.వెంకటరమణ, గ్రామ పెద్దలు బెందాళం వెంకటరమణ, బెందాళం కృష్ణారావు అందజేశారు. కార్యక్రమంలో రఘునాథ్ పాణిగ్రాహి, నవీన్‌కుమార్ పాణిగ్రాహి, గార వేణుగోపాల్, బెందాళం శోభన్‌బాబు పాల్గొన్నారు.

పోడు భూములకు పాస్ పుస్తకాలు ఇప్పించండి


వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

లావేరు: ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న కొండపోడు భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను జీజీ వలస గిరిజనులు కోరారు. ఈ మేరకు శనివారం రాత్రి ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపు కార్యాలయం వద్ద వారు కలిసి వినతి పత్రం అందించారు. అలాగే తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. కూటమి నాయకులు ముప్పిడి సురేష్, ఐ.తోటయ్యదొర, లంకలపల్లి శ్రీనివాసరావు, తార ఉత్తరరాజు, అప్పలరాజు, సాదే దేవుడమ్మ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కరోనా బాధిత కుటుంబానికి సాయం


సాయాన్ని అందిస్తున్న దృశ్యం

అరసవిల్లి: స్థానిక బాకర్‌సాహెబ్‌పేటకు చెందిన బద్రి రమేష్ కుటుంబానికి స్మాల్ సర్వీస్ టు సొసైటీ సంస్థ ద్వారా సాయం అందించారు. కరోనా సమయంలో రమేష్ మృతి చెందడంతో అతడి భార్య కుమార్తె ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న సొసైటీ సభ్యులు ఆదివారం రూ.పదివేలు నగదుతో పాటు, నెల రోజులకు సరిపడా సామగ్రి అందజేశారు. కలివరపు సూర్యప్రకాష్, లొట్టి సూరిబాబు, మండల మన్మధరావు, చీపురు రామ్మోహన్‌రావు ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ


రాష్ట్ర స్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచిన జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించి తమదైన శైలిలో సత్తాచాటుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ పోటీల్లో బాలుర జట్టు ద్వితీయస్థానం, బాలికలు తృతీయస్థానాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా బాల్‌బాడ్మింటన్ సంఘ ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు, జిల్లా ఛైర్మన్ సూర శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కోత పూర్ణచంద్రరావు, కోశాధికారి బీహెచ్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్: ఆరోగ్యవంతమైన సమాజానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతోపాటు దాతలు ముందుకు రావాలన్నారు. గెలుపు ఓటములు కంటే పోటీల్లో పాల్గొనడమే ముఖ్యమని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొన్న వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూధనరావు, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి పాల్గొన్నారు. సాయంత్రం ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని విజేతలకు పతకాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన జిల్లా ఫార్మసీ అధికారుల నూతన కమిటీ

అరసవల్లి: ఏపీ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నికలు జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికల్లో మూడు సంవత్సరాలకు గాను జిల్లా అధ్యక్షుడిగా ఆర్.సుబ్రహ్మణ్యం, సెక్రటరీగా కె.మల్లేశ్వరరావు, కోశాధికారిగా వై.ఆదిలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పి.శ్యాంసుందర్, వి.ధనుంజయరావు, వి.శ్రావణి, రఘునాథరావు, జాయింట్ సెక్రటరీలుగా యు.ప్రీతి, పి.శ్రీనివాసరావు, ఎస్.రమేష్, ఎల్.రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎస్.కిరణ్‌కుమార్, రాష్ట్ర పరిశీలకుడు బీఎస్ నాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్ వ్యవహరించారు. కార్యక్రమంలో జి.సోమేశ్వరరావు, జి.చక్రవర్తి, బి.భవాని, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళింగ కోమట్ల సంక్షేమానికి కృషి

అరసవల్లి: కళింగ కోమట్ల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. హయాతినగరంలో ఆదివారం కళింగ కోమట్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని మాట్లాడారు. అనంతరం వర్తక సంఘ నాయకులు ఎమ్మెల్యే శంకర్‌ను సత్కరించారు. వర్తక సంఘ నాయకులు కోరాడ హరగోపాల్, టీడీపీ నాయకులు జామి భీమశంకర్, అంధవరపు సంతోష్, సతీష్ పాల్గొన్నారు.

● స్థానిక ఫ్రెండ్స్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నదానంలో ఎమ్మెల్యే శంకర్ పాల్గొన్నారు. అలాగే పొట్టి శ్రీరాములు మార్కెట్‌కు చెందిన హమాలీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు.

కక్ష సాధింపు చర్యలకు బెదిరేది లేదు

● ఏఐసీసీ సభ్యుడు రాకేష్ రెడ్డి


డీఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: పార్టీలో ప్రశ్నించే నాయకులపై కక్షసాధింపు చర్యలకు బెదిరేది లేదని ఏఐసీసీ సభ్యుడు రాకేష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో రాకేష్ రెడ్డి, ఉత్తరాంధ్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. 'ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఈనెల 10న జరిగిన అగ్నిప్రమాద ఘటనలో డీసీసీ మాజీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావుపై మేడం చెప్పడంతోనే కేసు పెట్టానని ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు అన్నారు. ఆ మేడమ్ ఎవరో పార్టీ నాయకులకు చెప్పాలి. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల.. పార్టీకోసం శ్రమించిన నాయకులను పక్కన పెడుతున్నారు.' అని తెలిపారు. అనంతరం అగ్నిప్రమాద ఘటనపై విచారణ చేపట్టాలని, తప్పుడు కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సీహెచ్ వివేకానందకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పేడాడ పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న క్షేత్రంలో నృత్య ప్రదర్శన



ఇచ్ఛాపురం: శ్రీశైలం మల్లన్న క్షేత్రంలో నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. మూడు గంటల పాటు ఆలయంలో నృత్య ప్రదర్శన చేసిన కళాకారులకు ఆలయ ఈవో పి.పెద్దిరాజు అభినందించి జ్ఞాపికలు, ప్రసంసా పత్రాలు అందజేశారు. అకడామీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి, జయలక్ష్మి, చిన్నారులు పాల్గొన్నారు.

రేపు విశ్వకర్మ జయంతి

శ్రీకాకుళం కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విశ్వకర్మ జయంతి ఈ నెల 17న కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి అనూరాధ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, కుల పెద్దలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు హాజరై జయప్రదం చేయాలని ఆమె కోరారు.

అతడి నేత్రాలు సజీవం

అరసవల్లి: శ్రీకాకుళం నగ రంలోని మొండేటి వీధిలో నివా సం ఉంటున్న పెన్నిపోతుల గో విందరావు(84) ఆదివారం మృతి చెందాడు. అతని నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు పి.కుమార్, జి.గోవిందరాజులు, జి.సుగుణాకరరావు రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహన్ రావును సంప్రదించారు. దీంతో మగటపల్లి నేత్ర సేకరణ కేంద్రం ఐ టెక్నీషియన్ పి.సుజాత, అసిస్టెంట్ పవన్ కుమార్ గోవిందరావు కంటి నుంచి కార్నియాలు సేకరించి విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్రసేకరణ కేంద్రానికి అందజేశారు. తాను చనిపోయినా తన కళ్లను దానం చేసి మరో ఇద్దరికి వెలుగులు ప్రసాదించడం గొప్ప విషయమని రెడ్‌క్రాస్ సెక్రటరీ బి.మల్లేశ్వరరావు అంటూ నివాళులర్పించారు.

ఆదిత్యుని ఆదాయం రూ.3.08 లక్షలు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.3,08,997 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.1,26,700, విరాళాల ద్వారా రూ.48,007, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,34,290 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు.

డీఎస్పీలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైం: రాష్ట్రంలో 47 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ ఆదివారం రాత్రి డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ డీఎస్పీగా సీఐడీ విభాగంలో పనిచేస్తున్న ఏబీజీ తిలక్‌ను నియమించారు. అలాగే ఏఎన్‌టీఎఫ్ విభాగానికి వెయిటింగ్ అటాచ్‌మెంట్‌లో ఉన్న బి.రాజశేఖర్‌ను శ్రీకాకుళం మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీగా, వెయిటింగ్‌లో ఉన్న డీఎన్‌వీ ప్రసాద్‌ను డీటీసీ డీఎస్పీగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

అథ్లెటిక్స్‌కు కేజీబీవీ విద్యార్థినులు

పొందూరు: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు లోలుగు కేజీబీవీకి చెందిన విద్యార్థినులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య తెలిపారు. జిల్లాకేంద్రంలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో అండర్ 16 విభాగంలో పాల్గొన్న కె.జానకి షాట్‌పుట్‌లో మొదటిస్థానం, జావలిన్‌త్రోలో మూడో స్థానం, అండర్-18లో ఎం.ద్రాక్షాయని షాట్‌పుట్‌లో మొదటిస్థానం, వై.రమ జావలిన్‌త్రోలో రెండో స్థానం, పి.భవాని లాంగ్‌జంప్, హైజంప్‌ల్లో మూడో స్థానాలు, కె.ఇందు లాంగ్‌జంప్‌లో రెండో స్థానం సాధించారు.

కాలభైరవ మాతకి పూజలు



శ్రీకాకుళం కల్చరల్: బలగలో ఉన్న కాలభైరవ మాత అమ్మవారికి ప్రత్యేకంగా ముత్యాలహారాలు వేసి పూజలు నిర్వహించారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, పూలతో అలంకరణ నిర్వహించారు.

ఘనంగా తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం: ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో గల పలు వీధులకు చెందిన మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మట్టి బిందెలతో తీసుకెళ్లిన పసుపు నీరు, పానకాలతో అమ్మవారికి అభిషేకించారు.

ఉక్కు కవచం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం, (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి కవులు, రచయితలు, మేధావులు మద్దతుగా నిలిచారు. ఆదివారం ఉదయం స్థానిక గరిమెళ్ల ప్రెస్ క్లబ్‌లో అరసం, శ్రీకాకుళం జిల్లా శాఖ నిర్వహించిన సమావేశంలో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ.. ఉక్కు ఉద్యమానికి మద్దతుగా ఉత్తరాంధ్రలో ఐక్య సాంస్కృతిక పోరాట వేదికను రూపొందించాలని పిలుపునిచ్చారు. జరుగుతున్న ఉద్యమం కేవలం విశాఖ ఉక్కు కార్మికులకు సంబంధించినదిగానే చూడకూడదన్నారు. అరసం జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లి ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత ఇటీవల మృతి చెందిన సీపీఎం నేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా అరసం శాఖ ప్రచురించిన ఉక్కు కవనం అనే కవితా సంకలనాన్ని అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వీజేకే మూర్తి, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్, ఇంటాక్ ప్రతినిధి వావిలపల్లి జగన్నాథనాయుడు, అరసం ఉపాధ్యక్షుడు కలమట దాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

గార: అంబటివానిపేటలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించి మాటాడారు. పేదల కోసం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గోవిందరావు కుటుంబ సభ్యులు, స్థానిక పెద్దలు, వైద్యులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ, మావుడూరు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం తదితర నేపథ్య గాయకులు పాటల వల్ల తెలుగు భాష బతికి ఉందన్నారు. అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, వైద్యులు పి.మాలతి, సనపల నర్సింహమూర్తి, దానేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక విలువలతో మెలగాలి

సరుబుజ్జిలి: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆదర్శవంతమైన విలువలతో కూడుకున్న జీవన విధానాన్ని అలవర్చుకొని శ్రీరామచంద్రుని అడుగుజాడల్లో మెలగాలని రొట్టవలస శ్రీరామానందాశ్రమ వ్యవస్థాపక గురుస్వామి తొత్తడి వెంకటరమణ అన్నారు. ఆదివారం ఆశ్రమంలో శ్రీరామ సత్సంగ సమావేశం నిర్వహించారు. జక్కం వెంకటరావు, అనంతరావు భగవద్గీత పారాయణ ప్రవచనం చేడంతో ఆ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ అలముకుంది.